# దయ్యాలబండి

– నారాయణమూర్తి



డిసెంబర్ నెల
చలిపులి విజృంభించి వీర విహారం చేస్తోంది.

రైలు కూతవేసి కదిలింది.

బోగీలో జనం పల్చగా వున్నారు.

చీరాలలో రఘు పెళ్ళికి హాజరయి నేనూ, మోహన్ పాసింజర్ రైలెక్కాం.

రైలు ఎద్దు బండిలా మెల్లగా పోతోంది.

"ఈ రైలుకి దయ్యాలబండి అనే పేరుంది తెల్సా?" వున్నట్టుండి ఒక్కసారిగా అడిగాడు మోహన్.

ఊహించని ఆ ప్రశ్నకు ఉలిక్కిపడి "నిజంగా?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును. ఈ ప్రాంతంలో ఇప్పటికీ ఓ కథ ప్రచారంలో వుంది."

"ఏమిటది?" ఆసక్తిగా అడిగాను.

మోహన్ కథ చెప్పడం ప్రారంభించాడు.

***

'బంగారుబాబు' సినిమా విడుదలయిన రోజులవి.

రాముడు, శివుడు చీరాలలో రెండో ఆట సినిమా చూసి పాసింజరు రైలెక్కారు.

"చెంగావిరంగు చీర కట్టుకున్న చిన్నది" శివుడు హుషారుగా పాట పాడుతున్నాడు.

కిటికీలో నుంచి చల్లని గాలి వీస్తుంటే రాముడు చీకటి కన్య సింగారాలను పరిశీలిస్తున్నాడు.

రైలు స్లోగా నడుస్తోంది. సమయం రాత్రి రెండుదాటింది. ఇంతలో జాండ్రపేటలో రైలు ఆగింది. చీరాలలో ఎక్కిన ఒకరిద్దరూ కూడా దిగిపోయారు. శివుడు ఈలవేసుకుంటూ బాత్ రూంకి దారితీశాడు. బండి మళ్ళీ కదిలింది. సరిగ్గా అప్పుడే హడావుడిగా రైలెక్కిందో మెరుపు తీగలాంటి అమ్మాయి. అనుకోకుండా ఎదురుపడిన ఆ అందాలరాశిని చూసి శివుడు ఒక్క క్షణం శిలాప్రతిమ అయ్యాడు.

'ఇంత అందమైన అమ్మాయి... ఒంటరిగా' అనుకుంటూ బాత్ రూమ్‌లో దూరి మొహం కడుక్కొని తలదువ్వుకొని బయటకొచ్చాడు.

ఓరగా ఆ పిల్లకేసి చూస్తూ – తన సీటు వద్ద కొచ్చాడు.

రాముడు నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు.

శివుడు పక్కకొచ్చి ఆ పిల్ల కనబడేలా కిటికీ దగ్గర కూర్చున్నాడు.

శివుడికి అమ్మాయిల పిచ్చి ఎక్కువ.

ఆడ గాలి సోకితే నిద్రపోడు!

బంగారు మేనిఛాయ! సంపెంగ ముక్కు, ఎర్రటి పెదాలు, నవ్వించే కళ్ళు ... చూసే కొద్దీ మరీ మరీ ఆకర్షించే అందాలు ఆమెవి!

శివుడు ఆమెకేసి చూస్తూ మెల్లగా సైగలు చేయడం మొదలెట్టాడు. అరగంట గడిచాక అతని ప్రయత్నాలకు గుర్తింపు లభించింది.

ఆ పిల్ల కూడా చిలిపిగా చూస్తూ, కవ్వించ సాగింది.

శివుడికి ధైర్యమొచ్చింది. ఇక టైమ్ వేస్టు చేయదల్చుకోలేదు! అప్పటికే కోరికతో అతని నరాలు జివ్వుమనసాగాయి.

రాముణ్ణి నిద్రలేపాడు.

"ఒరేయ్! మాంచి పిల్ల వుంది! ఓ చూపు చూద్దామా?" అడిగాడు.

'ఎక్కడ' అడిగాడు రాముడు ఆవులిస్తూ.

"అలా చూడు! కన్పిస్తుంది" చెప్పాడు శివుడు. విసుక్కుంటూ లేచి రాముడు అక్కడ ఎర్రచీర కట్టుకున్న ఓ యువతి కూర్చొని వుండడం గమనించాడు. అలాంటి వ్యవహారాల పట్ల ఆసక్తిలేకపోవడంతో మౌనంగా మళ్ళీ పడుకున్నాడు.

"ఏరా? చూశావా?" అడిగాడు శివుడు.

"ఊఁ! నువ్వెళ్ళు! నాకు నిద్రొస్తుంది."

"సర్లే! కాని, బోగీ తలుపులన్నీ వేస్తున్నా! ఎవ్వరు అరచి గీ పెట్టినా తియ్యకు!" శివుడు హుషారుగా ఈలవేస్తూ బోగీ తలుపుల్నీ బిగించి ఆమె వద్ద కెళ్ళాడు.

***

రైలు కూతకు ఉలిక్కిపడి నిద్రలేచాడు రాముడు.

చేతికున్న వాచీకేసి చూశాడు.

సమయం నాలుగు అవుతోంది.

రైలు ఉప్పుగుండూరు దాటింది.

తాము దిగాల్సిన స్టేషన్ దాటిపోయేసరికి అతను కంగారుపడ్డాడు.

"శివా! శివా!" పెద్దగా పిలిచాడు.

సమాధానం లేదు.

లేచి హడావుడిగా బాత్ రూమ్ సమీపంలోని కంపార్ట్‌మెంట్ దగ్గరికెళ్ళి చూశాడు. అంతే!

ఒక్కసారిగా అతని గుండె జల్లుమంది!!

ఎదురుగా ఫ్యాన్‌కి వేలాడుతున్న శివుడి శవం!

ఆ దృశ్యం కంటపడగానే అతను అప్రయత్నంగా ఓ వెర్రి కేక వేశాడు.

***

చెప్పడం ఆపి సిగరెట్ వెలిగించుకున్నాడు మోహన్.

"ఇంతకూ 'శివుడు' ఎలా చనిపోయాడో చెప్పనేలేదు" అడిగాను.

"అదే ఈ కథలో మిస్టరీ! రాముడు తేరుకొని బోగీ అంతా గాలించినా ఆ ఎర్రచీర పిల్ల కన్పించలేదు! వేసిన తలుపులు వేసినట్లే వున్నాయి. ఆ పిల్ల చీరతోనే శివుడు ఉరి తీయబడ్డాడు!"

"అంటే? ఆ పిల్ల దెయ్యమంటావా?"

"ఇక్కడి వాళ్ళు అలాగే చెప్పుకుంటారు! శివుడిలాగానే అదే రీతిలో, అదే ప్రాంతంలో మరో ఇద్దరు కూడా చనిపోయారు."

"అది కేవలం కాకతాళీయం కావచ్చు కదా!"

"అఫ్‌కోర్సు! శివుడి దుర్మరణానికి మూడు నెలల ముందు ఇదే రైల్లో ఓ అమ్మాయి దారుణంగా రేప్‌కి గురయ్యి, ఆత్మహత్య చేసుకుంది. ఆ పిల్లే తనను రేప్ చేసిన ముగ్గురినీ ఇలా చంపి ప్రతీకారం తీసుకుందని మరో కథనం!"

"మరి రాముడేమైపోయాడో తెల్సా?"

"తెల్సు! ప్రస్తుతం నీ ఎదురుగానే వున్నాడు" చెప్పాడు మోహన్ – రామమోహన్!

అంతే! నాకు నోట మాటరాలేదు. రైలు ఉప్పుగుండూరు స్టేషన్‌లో ఆగింది. ●